క్లుప్తంగా

6న కిడ్నీవ్యాధుల వైద్యుల రాక

యానాం: పుదుచ్చేరి నుంచి కిడ్నీ సంబంధిత వ్యాధుల వైద్యులు ఈ నెల 6వ తేదీన స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రానున్నారని జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. కుమార్ ఆధ్వర్యంలో బృందం వచ్చి కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులను ఆరోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షిస్తారన్నారు.

ఎన్ఐసీ సేవలు ప్రశంసనీయం



ఎన్ఐసీ ఆఫీసును ప్రారంభిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సేవలు ప్రశంసనీయమైనవని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్ఏఓ ఆఫీసు ప్రాంగణంలో ఉన్న ఎన్ఐసీ ఆఫీసును మినీ సివిల్ స్టేషన్‌కు మార్పుచేసిన నేపథ్యంలో దానిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ ప్రజాసంబంధిత డేటాను సేకరించడం, దానిని కంప్యూటర్లలో భద్రపరచడం, జాతీయ స్థాయి సమాచారాన్ని తమ వెబ్‌సైట్‌లలో పెట్టడం వంటి వాటిని అందిండంలో ఎన్ఐసీ కీలకపాత్ర వహిస్తుందన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లికి సత్కారం



రామకృష్ణను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

యానాం: మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఖండవల్లి రామకృష్ణను సోమవారం యానాం గురుత్త బ్రాహ్మణసేవాసంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ అంశాలపై అధ్యయనం చేసి తగుచర్యలు తీసుకుంటానన్నారు. సంఘ అధ్యక్షుడు వేదుల సత్యం, హనుమంతరావు, ఋషి, నాగాబట్ల బుజ్జి, సీఎస్ఆర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బీవీవీ కవితకు తృతీయ బహుమతి

అమలాపురం టౌన్: హైదరాబాద్‌కు చెందిన తెలుగు భాషా సాహితీ సంస్థ ×సేవ సమూహ కవితా గ్రీష్మం¥ పేరుతో పోటీలను నిర్వహించింది. శాంతి దూత అనే అంశంపై గత నెల 25న ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పోటీల ఫలితాలను ఆ సంస్థ సోమవారం ప్రకటించింది. ఈ పోటీల్లో పాల్గొన్న అమలాపురానికి చెందిన కవి బీవీవీ సత్యనారాయణ రాసిన కవితకు తృతీయ బహుమతి వచ్చింది. ఈ విషయాన్ని కవి బీవీవీ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు.

గురుస్వామి మృతికి సంతాపం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో అయ్యప్ప స్వాములకు గురుస్వామిగా 41 సంవత్సరాల పాటు వ్యవహరించిన సలాది లక్ష్మీనారాయణ మృతి చెందడంపై సోమవారం పలువురు సంతాపం వ్యక్తం చేశారు. నీలపల్లి నీలకంఠ శ్రీధర్మశాస్త్ర సేవాసంఘం ప్రతినిధులు ర్యాలి సత్యనారాయణ, రాయుడు రామకృష్ణ సంతాపాన్ని తెలిపారు.

ఎమ్మెల్యే గొల్లపల్లిని కలిసిన ఎస్పీ రఘునాయగం



ఎమ్మెల్యే గొల్లపల్లిని సత్కరిస్తున్న ఎస్పీ రఘునాయగం

యానాం: ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్‌ను సోమవారం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రఘునాయగం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన స్వగృహానికి వెళ్లి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ని ఆవిష్కరించిన ఎంపీ అనురాధ

అల్లవరం: ఎఫ్ఎన్‌పీఓ పోస్టల్ యూనియన్ క్యాలెండర్‌ని మొగళ్లమూరులోని ఎంపీ నివాసంలో ఎంపీ చింతా అనురాధ సోమవారం ఆవిష్కరించారు. సఖినేటిపల్లి మండలం మోరిలో నూతన తపాలా కార్యాలయానికి నిధులు కేటాయించాలని కేంద్ర కమ్యూనికేషన్ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని కోరానని ఎంపీ తెలిపారు. యూనియన్ నాయకులు ఏకాంబరం, నరసింహం, అనీల్, వైవీ రమణ పాల్గొన్నారు.

దొరల సేవలకు నజరానా!

- ఫ్రెంచి దొరలు వెళ్లిపోయినా...వీధులకు వారి పేర్లు
- యానాంలో ఇప్పటికీ కొనసాగుతున్న వైనం



యానాం అడ్మినిస్ట్రేటర్ బంగ్లా

యానాం: వందల ఏళ్లు పాలించిన ఫ్రెంచి దొరలు దేశం విడిచి వెళ్లిపోయినా.. ఇంకా వారి పేర్లు మాత్రం అందరి నోళ్లనుంచి వినపడుతున్నాయి. అప్పట్లో వారు చేసిన సేవలకు గుర్తింపుగా పలు గ్రామాలకు వారి పేర్లను పెట్టారు. యానాంను ఫ్రెంచివారు పాలించే కాలంలో ఇక్కడి తమ చేనేత, ఉప్పు తదితర వ్యాపార వ్యవహారాలను చూడటానికి అప్పటి పాండిచ్చేరి గవర్నర్ జనరల్ ఫెరీరే క్రిష్టోఫస్ లీ నోయిర్ ఒక అధికారి (చీఫ్ ది సర్వీసెస్)ని నియమించేవాడు. ఆ అధికారిని పెద్దొర అని స్థానికులు పిలుచుకునేవారు. ప్రస్తుతం ఉన్న రీజినల్ అడ్మినిస్ట్రేటర్ భవనంలోనే పెద్దొర ఉండటంతో ఆ భవంతిని అప్పట్లో పెద్దొర బంగ్లా అని పిలిచేవారు. సుమారు రెండు శతాబ్దాల పాటు యానాంను పరిపాలించిన ఫ్రెంచిదొరల పేర్లు పట్టణ పరిధిలో పలు వీధులకు పెట్టడం అవి ఇంకా కొనసాగుతుండటం విశేషంగా చెప్పుకుంటారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఫ్రెంచి జనరల్ మిస్టర్ బుస్సీ చేసిన సహాయానికి కృతజ్ఞతగా విజయనగరరాజు చొరవతో ఇనామ్ అనే ఫ్రెంచి పేరును యానాంగా మార్చారు. ఇక్కడ బుస్సీ పేరుపైన వీధి కూడా ఉంది. ఈ వీధిలోనే బుస్సీ నివసించాడని చెబుతారు.

ఫ్రాంకోయిస్ కుర్‌సన్ పేరుతో కురసాంపేట

1817 సంవత్సరంలో యానాంకు పెద్దొరగా నియమితులైన ఫ్రాంకోయిస్ కుర్‌సన్ 1824 వరకు పదవిలో ఉన్నారు. ఫ్రాన్స్‌లో చాలా పలుకుబడి కలిగిన కుటుంబాన్నుంచి వచ్చిన కుర్‌సన్ అత్యంత వివాదాస్పదుడిగా అధికార దుర్వినియోగానికి పాల్పడి తన పదవిని కోల్పోయాడు. ఈయన తండ్రి షెవాలియర్ కుర్‌సన్ షిప్పులను పర్యవేక్షించే పెద్ద నౌకాధికారి. కుర్‌సన్ పేరుపై ఇప్పటికీ కురసాంపేట గ్రామం ఉండటం విశేషం.

ఫెర్రీ ఫెలిసైట్ వెలరీ హుగాట్ పేరుపై పరంపేట గ్రామం. 1854లో బ్రిటిష్‌వారు గోదావరి నదికి ఏటిగట్ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. పియరీ ఆరువందల ఫ్రాంకుల ఖర్చుతో యానాం ఏటిగట్టును చేర్చి మూడు లాకులు, మూడు పంట కాలువలను నిర్మించాడు. ఆయన పేరుపై పరంపేట వచ్చింది.

బుస్సీ వీధి

బుస్సీ 1751లో నిజాం పాలకులకు మిలటరీ సహాయాన్ని అందించటం కోసం పుదుచ్చేరి నుంచి బయలుదేరి వెళ్లి చాలాకాలం దక్కను ప్రాంతంలోనే బసచేశాడు. 1753లో యానాం, మచిలీపట్నంల వద్ద బుస్సీ తదితరులు ఉన్నట్లు చరిత్ర చెబుతుంది. బుస్సీ నిజాం ప్రభువు నుంచి సారవంతమైన నేలలు కొన్నింటిని ఈనాంగా పొంది కోస్తా తీరంలో ఫ్రెంచి జెండాను మళ్లీ ఎగురవేశాడని చెబుతారు. ఆ విధంగా బుస్సీ నివాసం ఉన్నాడని చెబుతున్న వీధికి ఆయన పేరు పెట్టారు. గిరియాం అనే ఇంజినీరు పేరు మీద గిరియాంపేట అనే గ్రామం వచ్చిందని చెబుతారు.

ప్రత్యేక అలంకరణలు

ఉప్పలగుప్తం: మండల పరిధిలోని చల్లపల్లి, ఎస్.యానాం, భీమనపల్లి, విలసవిల్లి, చినగాడవిల్లి గ్రామాల్లో రామాలయాల్లో, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి, పూలు, తులసి దళాలతో అలంకరించారు. ఏకాహ భజన, కోలాటాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆ డైరీలో పెద్దొరల వివరాలు



1723 –1758 మధ్యకాలంలో పలువురు పెద్దొరలుగా వ్యవహరించారు. వీరంతా ప్రస్తుత రీజినల్ అడ్మినిస్టేటర్ బంగ్లాలోనే నివాసం ఉంటూ పాలన సాగించేవారు. ఆనందరంగ పిళ్ళై డైరీలో కొంతమంది ఫ్రెంచి పెద్దొరల వివరాలు తెలిశాయి.

–డాక్టర్ బొల్లోజు బాబా, చరిత్రకారుడు, అధ్యాపకుడు, యానాం



బుస్సీ వీధి



కురసాంపేట వీధి



పరంపేట వీధి

కనుల వైకుంఠంగా ఉత్తర ద్వార దర్శనం



అమలాపురంలో ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరిన భక్తులు

అమలాపురం టౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినంతో అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్త జనం పోటెత్తారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఉత్తర ద్వారం ద్వారా భక్త జనం స్వామిని దర్శనం చేసుకునేందుకు బారులు తీరారు. సాయంత్రం వరకు భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తి పాటల విభావరి ఆకట్టుకుంది. మంగళ వాయిద్యాలు, మామిడి తోరణాలు, పూల మాలలతో ఆలయాన్ని, ప్రాంగణాన్ని అలంకరించారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, కలెక్టర్ హిమాన్షు శుక్లా, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఆర్డీవో వసంతరాయుడు స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఈవో దూనబోయిన సాయిబాబు స్వాగతం పలికారు.

ఘనంగా ముక్కోటి పూజలు

యానాం: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సోమవారం తెల్లవారు జామునుంచే స్వామివారి దర్శనానికి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి గరుడ వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. నల్లం నాగబాబు, శ్రీరామచంద్రమూర్తి దంపతులు స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్, అర్చకుడు పెద్దింటి వినోదాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా శాంతి కల్యాణం

అల్లవరం: బెండమూర్లంకలో బంగారు తిరుపతిగా ప్రసిద్ధి చెందిన భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వారం నుంచి స్వామి వారి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవగుప్తంలోని కోదండ రామాయలంలో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. ఏకాహంలో హరినామ సంకీర్తనలు ఆలపించారు.కోడూరుపాడులోని సీతారామపేటలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించారు. అల్లవరంలో వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహించి, ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కల్పించారు.

సుదర్శన హోమం

అమలాపురం రూరల్: పాత బండారులంకలో బళ్లవారివీధిలో వేంచేసియున్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి వారి మందిరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సామాహికం సుదర్శన హోమం, పూర్ణాహుతి జరిగింది. బిళ్ల విశ్వేశ్వరావు, లక్ష్మీకుమారి దంపతులు స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పలు ఆలయాల్లో వేడుకలు

తాళ్లరేవు: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పలు ఆలయాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన తాళ్లరేవు, కేశవపురం, పి.మల్లవరం, జార్జీపేట తదితర గ్రామాలలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. పి.మల్లవరంలో వేంచేసియున్న శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఈఓ నున్న రామారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఖండవిల్లి సీతారంగాచార్యులు, సత్యవెంకట సీతారామాచార్యులు, శ్రీనివాసాచార్యులచే స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. జార్జీపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు వాడపల్లి గోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చోడి శ్రీరామమూర్తి పర్యవేక్షణలో స్వామివారికి 11 మంది దంపతులచే లక్ష పత్రిపూజ నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 74వ ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహించారు. జార్జీపేట సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, కొల్లు శ్రీను, ధూళిపూడి సుబ్బారావు, ఉంగరాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రామానుజ జీయర్ స్వామి పూజలు

అమలాపురం టౌన్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మంటపంలో ధనుర్మాస ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న భీమవరం భాష్యకార పీఠాధిపతి త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి పూజలు సోమవారం జరిగాయి. శ్రీదేవి భూదేవి సమేత గోవింద పెరుమాళ్ ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. తిరుప్పావై సేవా కాలం, తీర్థ గోష్ఠి తులసి దళాలతో శ్రీ విష్ణు సహస్ర నామార్చన చేశారు. రామానుజ స్వామి ముక్కోటి ఏకాదశి పర్వదిన విశిష్టతపై అనుగ్రహ భాషణ చేశారు. పట్టణ వైశ్య సంఘం ప్రతినిధులు నందిపాటి శ్రీనివాస్, యెండూరి వెంకట్రామయ్య, వంకాయల కాశి, వరదా సూరిబాబు భక్తులకు సేవలందించారు. స్థానిక గండు వీధిలో గల శేషశయన పాన్పు ఆలయంలో ముక్కోటి ఏకాదశి 112వ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయంలో ఏకాహం మొదలైంది. గండు వీధి శేష శయన మైనర్స్ పార్టీ ఆధ్వర్యంలో ముక్కోటి ఉత్సవాలు జరుగుతున్నాయి.



బెండమూర్లంకలో పుష్పాలంకరణలో భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి



బండారులంకలో వేంకటేశ్వరస్వామి వారి మందిరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న భక్తులు



గోవింద పెరుమాళ్‌కు తులసి దళాలతో పూజ చేస్తున్న రామానుజ జీయర్ స్వామి

మౌలిక వసతుల కల్పనకు కృషి



స్వామిని దర్శించుకుంటున్న ఎమెల్యే జగ్గిరెడ్డి దంపతులు

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు పెరగడంతో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించిందని ఇందుకోసం రహదారులు తదితర మౌలిక వసతులు కల్పించడానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఉదయం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వాడపల్లి వెంకన్న ఆలయంలో సతీసమేతంగా ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఈ ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో భక్తుల సంఖ్యకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. ఆలయంలో అన్నదానానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ ఆలయానికి వెళ్లే రహదారులు, వంతెనలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సవాల సమయంలో వచ్చే భక్తులు, యాత్రికులకు తగిన రవాణా సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే పార్కింగ్ స్థలాన్ని సైతం అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి పనులపై ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆలయంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన ద్వారాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏర్పాట్లను చైర్మన్, ఈవో ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



తైక్వాండోలో తృతీయ స్థానం సాధించిన లక్ష్మి, భార్గవి కోచ్ త్రిమూర్తులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో అంబాజీపేటకు చెందిన ఆర్‌డీఎస్.లక్ష్మి, వీటీ భార్గవిలు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ గత నెల డిసెంబర్‌లో 27 నుంచి 30 వరకు నిర్వహించిన తైక్వాండో అండర్–14లో ఆర్‌డీఎస్ లక్ష్మి 38 కేజీల విభాగంలో తృతీయ స్థానం సాధించారన్నారు. కడప జిల్లా రైల్వే కోడూరులో 26 నుంచి 27 వరకు జరిగిన అండర్–19 తైక్వాండో పోటీల్లో భార్గవి 42 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. క్రీడాకారులను హెచ్‌ఎం బీర హనుమంతరావు, కోచ్‌లు బి.కుసువీర్, కె.వైష్ణవి, పీఎంసీ సభ్యులు కామిశెట్టి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ ఇన్‌చార్జిగా మౌసి

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రీజినల్ ఇన్‌చార్జిగా షేక్ మౌసి నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. రాయవరం మండలం కురకాళ్లపల్లి సచివాలయంలో పశు సంవర్థకశాఖ సహాయకుడిగా మౌసి విధులు నిర్వహిస్తున్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీపాషా షేక్ నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు తెలిపారు. పశు సంవర్థకశాఖ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడుగాను తాను ఎంపికైనట్లు తెలిపారు. దీనికి సంబంధించి అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బి.సేవానాయక్ నియామక ఉత్తర్వులు అందజేసారని చెప్పారు.

జిన్నూరి సేవలు అభినందనీయం

ఉప్పలగుప్తం: ఇటీవల వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యుడిగా నియమితులైన నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు, వెంకట నారాయణలక్ష్మి దంపతులను సోమవారం గ్రామస్తులు సత్కరించారు. గ్రామంలో పీఎంపీ వైద్యునిగా సేవలందిస్తున్న విలసవిల్లికి చెందిన కుందెం భాస్కరరావు, సుభద్రమ్మ దంపతులను సత్కరించారు. ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, మాజీ సర్పంచ్‌లు శీలం సూరిబాబు, చేటకాయల సూర్యావతి పాల్గొన్నారు.

చలపతిరావు మృతికి సంతాపం

అమలాపురం రూరల్: ఉమ్మడి ఏపీ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ చలపతిరావు మృతికి కోనసీమ జిల్లా బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వెంపరాల భాస్కర శాస్త్రి అధ్యక్షతన సంతాప సభ జరిగింది. చలపతిరావు చిత్రపటానికి నివాళిలర్పించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, మహిళా మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి చిట్టూరి రాజేశ్వరి, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి ఈశ్వర్ గౌడ్, యువ మోర్చా రూరల్ ప్రధాన కార్యదర్శి బొంతు శివాజీ, యువ మోర్చా టౌన్ అధ్యక్షుడు నందూరి శ్రీరామ్ అంజలి ఘటించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ఉప్పలగుప్తం: మండల పరిధి ఎస్.యానాం, పేరాయిచెరువు గ్రామాల్లో పిచ్చికుక్క ఆది, సోమవారాల్లో సంచరించి పదిమందిని గాయపరిచింది. వీరిని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు మెరుగైన చికిత్స కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి పంపించారు. ఈ విషయంపై చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

బుద్ధిస్ట్ క్యాలెండర్ ఆవిష్కరణ

తాళ్లరేవు: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కాశి జానకిరాముడు, ఉంగరాల వెంకటేశ్వరరావు, జక్కల ప్రసాద్‌బాబు, వడ్డి ఏడుకొండలు, వాకపల్లి చిరంజీవి ఆవిష్కరించారు.

బ్రహ్మార్పణ్ పథకానికి విరాళాలు

తాళ్లరేవు: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన పథకం బ్రహ్మార్పణ్ పథకానికి విరాళాలు వెల్లువెత్తాయి. ప్రతీరోజూ అభాగ్యులైన ఆరుగురు నిరుపేదలకు ఇంటివద్దకే భోజనం అందించే పథకాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పథకానికి కొప్పిశెట్టి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.3 లక్షలు, లయన్స్‌క్లబ్ జిల్లా ఉప గవర్నర్ వేలూరి సూర్యనారాయణ రూ.లక్ష, మాజీ గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు రూ.10 వేలు, చోడే శ్రీనివాస్ రూ.10 వేలు విరాళాలను అందజేశారు. దాతలకు శ్రీనివాసరెడ్డి తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఏఎఫ్ స్థూపం ఆవిష్కరణ



ఎస్ఏఎఫ్ స్థూపం వద్ద జేజేలు పలుకుతున్న శెట్టిబలిజ సామాజిక వర్గీయులు

అల్లవరం: తూర్పులంకలో శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ స్థూపాన్ని ఎస్ఏఎఫ్ అధ్యక్షులు వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తూర్పులంకలో జరిగిన కార్యక్రమంలో సుభాష్ మాట్లాడుతూ శెట్టిబలిజలు ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు. కడలి గంగాచలం, రాయుడు విష్ణు, దొంగ శ్రీను, చొల్లంగి వెంకటరమణ, కేవీ, కుడుపూడి సామ్రాట్ పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ



పట్టాలను లబ్ధిదారులకు అందజేస్తున్న నాగేంద్ర

అమలాపురం టౌన్: స్థానిక 15,16 వార్డులకు సంబంధించి బోడసకుర్రులోని టిడ్కో ఇళ్లు మంజూరైన లబ్దిదారులకు ఆ ప్లాట్ల పట్టాలను వార్డు సచివాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన 16వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, 15వ వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. నాగేంద్ర మాట్లాడుతూ అర్హులైన నిరుపేదలందరికీ సొంత గూడు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పేదల పక్షపాతిగా పనిచేస్తున్నారని అన్నారు. వార్డు సచివాలయ కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, బి.సురేష్‌కుమార్, కొప్పిశెట్టి వెంకట గణేష్, ఎస్.కార్తీక్, జె.హవిలా, రమేష్, జి.పద్మ పాల్గొన్నారు.

కరాటేలో నాగచందు ప్రతిభ

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే జిల్లా స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో చింతలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మాదాసి నాగచందు ప్రతిభ చూపాడు. ఈ మేరకు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన నాగచందును సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.